క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



రికార్డులు పరిశీలిస్తున్న పురుషోత్తం

కెరమెరి: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఏటీడబ్ల్యూవో పురుషోత్తం అన్నారు. మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. గిడ్డంగిలో సరుకులు, రికార్డులకు సరితుగూతున్నాయా? లేదా అనే విషయాలను పరిశీలించారు. విద్యార్థులను నాణ్యమైన భోజనం అందించాలన్నారు. వంద రోజుల కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం బలిరాం, హెచ్‌డబ్ల్యూవో వసంత్‌రావు తదితరులు ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో గురువారం సీసీ రోడ్డు పనులను జెడ్పీటీసీ దుర్పతబాయి, ఎంపీపీ పెందోర్ మోతిరాం ప్రారంభించారు. జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో రోడ్డు నిర్మించనున్నట్లు వారు తెలిపారు. పనుల్లో నాణ్యత ఉండాలని, త్వరగా పూర్తి చేయాలన్నారు. ధనోరా, పార్డ సర్పంచులు చిలుక, భీంరావు, నాయకులు కేశవరావు, యూనూస్, బషీర్ తదితరులు ఉన్నారు.

ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు

దహెగాం: నేషనల్ హెల్త్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.32 వేలు ఇవ్వాలని, రూ.25 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మధుకర్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ వారికి ఇచ్చిన ఎన్నికల హామీలు నెరవేర్చకపోవడంతోనే హైదరాబాద్‌లో ఈనెల 9న మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగులు మాధవి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

బీజేపీ సమావేశానికి హాజరైన 'కొత్తపల్లి'

ఆసిఫాబాద్: హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన అన్ని జిల్లాల అధ్యక్షుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితోపాటు నాయకులు పాల్గొన్నారు. అలాగే కుమురంభీం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ సమావేశానికి హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి ఆరుముల్ల పోశం, ఎన్నికల ఇన్‌చార్జి లచ్చన్నతోపాటు మహారాష్ట్ర యవత్‌మాల్ జిల్లా వని నియోజకవర్గ ఎమ్మెల్యే జంజీవ్‌రెడ్డి బోదువార్ కలిసి పాల్గొన్నట్లు శ్రీనివాస్ తెలిపాడు.

ఉచిత విద్యుత్ అందించాలి

వాంకిడి: జీవో 342 ప్రకారంగా దళిత కుటుంబాలకు 101 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీర్ సౌమ్యశ్రీకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితులకు 101 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నారు. లేకపోతే భవిష్యత్తులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాయాల ముట్టడిస్తామని హెచ్చరించారు. వెంకటేశ్, లింగయ్య, మల్లయ్య, వెంకటి, తిరుపతి, పుష్ప, మధునక్క, సాలక్క ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

వాంకిడి: మండలంలోని చౌపన్‌గూడ ఏహెచ్ఎస్ శాటిలైట్ సెంటర్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి డ్రైడే నిర్వహించారు, నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో యాంటీ లార్వా మందులు వేశారు. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్యాధికారి వినయ్ ఉప్రె, హెచ్ఈవో పెందుర్ రవిదాస్, హెచ్ఏ భగవాన్‌దాస్, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడి.. సమస్యల ఒడి

- శిథిలావస్థకు భవనాలు
- ఊడుతున్న పెచ్చులు
- భయం భయంగా చదువులు
- ఇబ్బందుల్లో విద్యార్థులు
- ఇందాపూర్, దేవుడ్‌పల్లి పాఠశాలల దుస్థితి



కూలడానికి సిద్ధంగా ఉన్న దేవుడ్‌పల్లి పాఠశాల



శిథిలావస్థకు చేరిన ఇందాపూర్ పాఠశాల

కెరమెరి: మండలంలోని ఇందాపూర్ ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాల దేవుడ్‌పల్లి పాఠశాలలు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. భవనాలు శిథిలావస్థకు చేరగా, పెచ్చులూడి దర్శనమిస్తున్నాయి. భయంభయంగా విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. చిన్న వర్షానికే ఊరుస్తుండడంతో పడరాని పాట్లు పడుతున్నారు. కూర్చునేందుకు స్థలం లేక ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు, పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండు పాఠశాలల్లో.. ఆరుగురు టీచర్లు

ఇందాపూర్‌లో 1 నుంచి 7వ తరగతి వరకు 100 మంది, దేవుడ్‌పల్లి 1 నుంచి 5వ తరగతి వరకు 12 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఆయా రెండు బడుల్లో ఆరుగురు టీచర్లు విద్యాబోధన చేస్తున్నారు. ఆ రెండు పాఠశాలల నిర్మాణం 40 ఏళ్లకు పైగా జరిగింది.

ఒక్కోగదిలో మూడు తరగతులు

ఇందాపూర్‌లో ఏడు తరగతులకు మూడు తరగతి గదులున్నాయి. అందులో రెండు అతి పురాతనమైనవి, ఒక్కటి మాత్రమే రెండేళ్ల క్రితం నిర్మించింది. ఒక తరగతుల వారికి పాఠాలు బోధిస్తే మరో తరగతి విద్యార్థులు ఆరు బయట వెళ్లాల్సిందే. ఒక్కో గదిలో రెండు, మూడేసి తరగతుల వారికి పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నా తరగతి గదులు లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. కాగా, దేవుడ్‌పల్లి పాఠశాలలో ఇకే భవనం ఉండడంతో అన్ని తరగతుల వారిని ఒకేచోట కూర్చొపెట్టి టీచర్లు చదువులు చెబుతున్నారు. పాఠశాల పైకప్పు ఆనుకుని ఉన్న భీమ్ వంగి ఉండడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. సౌకర్యాలు లేకపోవడంతో అనేక మంది పిల్లలను హాస్టల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. నూతన భవనాలు నిర్మించకుంటే పాఠశాలలు మూతపడే ప్రమాదం లేకపోలేదు.

రెండోవిడతలో ఎంపిక చేయాలి



రెండో విడత మన ఊరు -మన బడిలో మా పాఠశాల ఎంపిక చేయాలి. సమస్యలు ఉన్నాయి. భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉంది. అధికారులు నూతన భవనం నిర్మించాలి.

– రజిత, హెచ్ఎం, ఇందాపూర్ యూపీఎస్

'మన ఊరు..మన బడిపై ఆశలు'

మొదటి విడతలో మండలంలోని 19 పాఠశాలల్లో 'మన ఊరు-మన బడి' నిధులు మంజూరయ్యాయి. తక్కువ మంది విద్యార్థులున్నా పాఠశాలలకు నిధులు మంజూరైనవి. కాని ఇందాపూర్ యూపీఎస్ పాఠశాలు ఎంపిక కాకపోవడం గమనార్హం. త్వరలో రెండోవిడత మన ఊరు-మన బడి కింద పాఠశాలలు ఎంపిక కానున్నాయి. ఇందులో ఈ పాఠశాలలు ఎంపిక చేయాలని టీచర్లు, విద్యార్థులు కోరుతున్నారు.

కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి(ఆసిఫాబాద్): కూరగాయల సాగుపై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కెరమెరి మండలం ఝరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. స్థలాలు ఉన్న ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో వంకాయ, టమాట, ఆకుకూరలు, బెండకాయ వంటి కూరగాయలు పండించాలన్నారు. అనంతరం డ్రెయినేజీల చివరన నిర్మిస్తున్న సామూహిక ఇంకుడు గుంతలను పరిశీలించారు. డీఎల్‌పీవో ఉమర్ అహ్మద్, ఎంపీడీవో మహేందర్, కార్యదర్శి ధర్మయ్య ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ఆసిఫాబాద్: జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని దీపక్ తివారి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల అదనపు తరగతుల నిర్మాణ పనులు పూర్తిచేయాలన్నారు.



సాగును పరిశీలిస్తున్న దీపక్ తివారి

నీటికుంటలు పరిశీలన

కాగజ్‌నగర్‌రూరల్: చింతగూడలో వర్షపు నీరు నిల్వ చేసే నీటి కుంటలను దీపక్ తివారి పరిశీలించారు. కుంటల నిర్మాణాలు మరో పది రోజుల్లో పూర్తి చేయాలన్నారు. అనంతరం బల్లల గ్రామంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలను పరిశీలించారు. ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ ఉన్నారు.

పాఠశాల సందర్శన

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పెట్రోల్‌పంపు ప్రభుత్వ పాఠశాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి గురువారం సందర్శించారు. ఎంపీడీవోతో కలిసి పాఠశాలలో ముఖ్యమంత్రి అల్పాహార పథకం నిర్వహణపై చర్చించారు.

పీవీటీజీ విద్యార్థులకు నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని పీవీటీజీ విద్యార్థులు ప్రభుత్వం అందించే ఉచిత నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని గిరిజన గురుకులాల సమన్వయ అధికారి గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పీవీటీజీ ప్రతిభా కళాశాలలో 50 మందికి ఉచితంగా నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన పీవీటీజీ తెగకు చెందిన విద్యార్థులు ధ్రువపత్రాలతో ఉట్నూర్ ఆర్‌సీవో కార్యాలయంలోగాని, ఆసిఫాబాద్ పీవీటీజీ గురుకులంలోగానీ సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94909 57303 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పంట పొలాలు పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రంతోపాటు ఏటిగూడ, చిన్న సిద్దాపూర్, రంగాపూర్, ఎలుకపల్లి తదితర గ్రామాల్లోని పంట పొలాలను గురువారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు ఏఈవో మీనాతో కలిసి పరిశీలించారు. క్లస్టర్ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు. పత్తి, వరి పంటల్లో పచ్చదోమ, తెల్లదోమ, ఇతర తెగుళ్ల రాకుండా పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించాలన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యసిబ్బంది స్థానికంగా ఉండాలని సూచించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఆయన వెంట మండల వైద్యాధికారి ఉప్రె వినయ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్

ఆడపడుచులకు పండుగ కానుక



ఆసిఫాబాద్‌అర్బన్: మహిళలకు బతుకమ్మ చీరెలు అందిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్



కాగజ్‌నగర్‌రూరల్: చీరెలు అందజేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు

ఆసిఫాబాద్‌అర్బన్/ఆసిఫాబాద్: ఆడపడుచులకు సీఎం కేసీఆర్ బతుకమ్మ పండుగ కానుకగా చీరలు అందిస్తున్నారని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ తెలిపారు. మండలంలోని సాలెగుడా గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ ఎదుట డ్రెయినేజీ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. జాలర్లకు నిర్మించ తలపెట్టిన కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్, సర్పంచ్ వినోద్ ఉన్నారు.

కెరమెరి: పార్డ, ధనోరా, ఝరి పంచాయతీల్లో జెడ్పీటీసీ సెద్మకి దుర్పతబాయి, ఎంపీపీ పెందోర్ మోతిరాం గురువారం మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. సర్పంచులు చిలుక, భీంరావు, న్యాన్శేశ్వర్ సీసీలు సుభాశ్ తదితరులు ఉన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: చింతగూడ, కోయవాగు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ పండుగ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన చీరెలను మహిళలకు పంపిణీ చేశారు. క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేశారు. నాయకులు కుమార్, మల్లేశ్, నాగేందర్, బాబా తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్, ఐకేరెడ్డికి కృతజ్ఞతలు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా ఆలయాల్లో డీడీఎన్ పథకంలో పనిచేస్తున్న అర్చకులకు ఇస్తున్న వేతనాన్ని రూ.10 వేలకు పెంచడంపై రాష్ట్ర కమిటీ సభ్యుడు గంగు సత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌శర్మ హర్షం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఐకేరెడ్డికి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. డీడీఎన్ పథకంలోకి 350 ఆలయాలు చేర్చడంతో ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా వీటి సంఖ్య 6,721కి చేరిందని పేర్కొన్నారు.

మధ్యాహ్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మద్దతు తెలుపుతున్న ఆత్మారాం నాయక్



పెంచికల్‌పేట్: భిక్షాటన చేస్తున్న కార్మికులు



కెరమెరి: నిరసన తెలుపుతున్న కార్మికులు

రెబ్బెన: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అజ్మీర ఆత్మారాం నాయక్ అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు చేపట్టిన సమ్మె 8వ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలో కార్మికుల దీక్షా శిబిరాన్ని గురువారం సందర్శించి వారి సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనికి తగ్గ వేతనం అందించాలన్నారు. గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఏళ్లుగా పనిచేస్తున్న ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

కెరమెరి: పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె గురువారం 11వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా పలువురు ఎండీఎం కార్మికులు మాట్లాడారు. వేతనాల చెల్లింపులకు నిధులు కేటాయించాలన్నారు. కొత్త మెనూ, గుడ్లకు అదనపు బడ్జెట్ కేటాయించాలన్నారు. సీఐటీయూ నాయకుడు కూటికల ఆనంద్, లలిత, ప్రేమల, కవిత, రజిత, రాజవ్వ, సునిత, శోభా మెంగుబాయి, సోంబాయి, శాంతాబాయి, రాజవ్వ ఉన్నారు.

'ఐదుశాతం ఐఆర్ ప్రకటన సిగ్గుచేటు'

ఆసిఫాబాద్‌అర్బన్: ఉద్యోగులు, పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఐదుశాతం ఐఆర్ ప్రకటించడం సిగ్గు చేటని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు భుక్యా గోవింద్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. 14 నుంచి 20 శాతం ఐఆర్ ప్రకటిస్తున్నట్లు ఊదరగొట్టి చివరకు మొండిచేయి చూపారని మండిపడ్డారు. సీఎం, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు రూ.లక్షల్లో గౌరవ వేతనం పొందుతూ ఉద్యోగులకు కనీసం చెల్లించరా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చే ఐఆర్‌ను 20 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

చింతలమానెపల్లి: సమాజసేవలో యువత భాగస్వాములు కావాలని ఎస్సై వెంకటేశ్ పిలుపునిచ్చారు. మండలంలోని డబ్బా గ్రామంలో ఎస్ఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు గురువారం ఆర్థికసాయం అందజేశారు. మహిళ కమల తన కుమారులను చదివించడానికి ఇబ్బందులు పడుతుండడంతో విషయం తెలుసుకున్న ఎస్ఆర్ఎస్ యూత్ సభ్యులు స్కూల్ బ్యాగ్, విద్యాసామగ్రి, దుప్పట్లతోపాటు 3వేల ఆర్థిక సాయం అందించారు. యూత్ సభ్యులను ఎస్సై అభినందించారు. శ్రీనివాస్, వెంకటేశ్, గుర్లె అశోక్, నికాడె సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని టీజీబీ ఆధ్వర్యంలో బెస్తకాలనీ ప్రజలకు గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఎంవీ రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ కళాజాత బృందం సభ్యులు ప్రజలకు బ్యాంకు సేవలు తదితర అంశాలను ఆటపాటల రూపంలో వివరించారు. బ్యాంకు మేనేజర్ రాజ్‌గోపాల్, కళాజాత బృందం సభ్యులు పాల్గొన్నారు.

వర్క్‌షాప్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు అన్నారు. కార్మికులతో కలిసి గురువారం బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యను కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ వర్క్‌షాప్ ఉద్యోగులకు ప్లేడేలు పెంచాలని, వర్క్‌షాప్‌కు ఉద్యోగులను నియమించి పనులు కల్పించేలా యాజమాన్యంతో మాట్లాడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీబీజీకేఎస్ చర్చల ప్రతినిధి ధారావత్ మంగీలాల్, ఏరియా అసిస్టెంట్ కార్యదర్శి మిట్టపల్లి కుమారస్వామి, ఏరియా వర్క్‌షాప్ ఫిట్ కార్యదర్శి కందుల తిరుపతి, ఏరియా నాయకులు రాజేశం, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి చంద్రయ్య, నాయకులు రాజేశం, వైకుంఠం శ్రీనివాస్, రాములు, రాజయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను కలిసి సమస్యను వివరిస్తున్న వర్క్‌షాప్ కార్మికులు

వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతు చేపట్టాలి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని శ్రీ భీమన్న స్టేడియంలో వాకింగ్ ట్రాక్‌కు వెంటనే మరమ్మతు చేపట్టాలని వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడారు. వాకింగ్ ట్రాక్ సరిగా లేకపోవడంతో వాకర్స్ పడుతున్న ఇబ్బందులను సింగరేణి యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా మరమ్మతు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. స్టేడియంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి ఉపేందర్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, సుగ్రీవులు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆరె కుల సంఘం భవనానికి భూమిపూజ

సిర్పూర్(టి): మండలకేంద్రంలోని డౌనల్ ప్రాంతంలోని సాయిబాబా ఆలయ సమీపంలో మండల ఆరె కుల సంఘం భవన నిర్మాణానికి జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు గురువారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణానికి రూ.15 లక్షల నిధులను ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మంజూరు చేశారని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ తోట మహేశ్, మండల కోఆప్షన్‌సభ్యుడు కిజర్‌హుస్సేన్, నాయకులు ఎల్ములే కిశోర్‌కుమార్, అబ్దుల్ అఖిల్, చౌదరి నానాజీ, శంకర్, షిండె లాలాజీ, ఆరె సంఘం నాయకులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి: వాంకిడి శివశంకర్ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్(ఎఫ్‌పీసీ)లో సీఈవో పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐకేపీ ఏపీఎం ఓ తెలిపారు. బీఎస్సీ అగ్రికల్చర్ లేదా సాధారణ బీఎస్సీ కోర్సు పూర్తి చేసుకుని వ్యవసాయ రంగంలో అనుభవం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎఫ్‌పీసీలో సభ్యత్వం కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6 నుంచి 8వ తేదీ 5 గంటల్లోగా జిల్లా కేంద్రంలోని గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్నివర్గాల అభివృద్ధే లక్ష్యం

కాగజ్‌నగర్‌టౌన్: అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పేర్కొన్నారు. పట్టణంలోని మున్నూరుకాపు సంఘం కమ్యూనిటీ భవనం అదనపు పనులకు రూ.25 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిన ఉత్తర్వులను గురువారం సంఘం ప్రతినిధులకు అందజేశారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఇచ్చిన హామీ మేరకు నిధులు మంజూరు కావడం హర్షణీయమని సంఘం అధ్యక్షుడు కలికోట రమణయ్య, తాటి రాంచందర్, గజ్జి రామయ్య, గజ్జివాసుదేవ్, పిర్సింగుల పోచయ్య అన్నారు. అనంతరం సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ వైస్ చైర్మన్‌ను సన్మానించారు. సంఘం నాయకులు, కాగజ్‌నగర్ ఎంపీపీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఇంటింటా ప్రచారం

కాగజ్‌నగర్‌టౌన్: త్వరలో జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో బీఎస్పీ ఆధ్వర్యంలో గురువారం ఇంటింటా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి వచ్చే ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండుసార్లు ఫాగింగ్ చేయాలి

కెరమెరి: ఈగలు, దోమలు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో వారంలో రెండుసార్లు ఫాగింగ్ చేయాలని డీఎల్‌పీవో ఉమర్ అహ్మద్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి సిబ్బందికి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీనెల విద్యుత్ చార్జీలు చెల్లించాలని, ప్రతిరోజు 9 గంటలలోపు హాజరు వేయాలన్నారు. నెలనెలా పారిశుధ్య కార్మికుల వేతనాలు ఇవ్వాలన్నారు. ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించాలని, ఇంటి పన్నులు వసూళ్లు చేయాలన్నారు. ఎంపీడీవో మహేందర్, ఈజీఎస్ ఏపీవో మల్లయ్య ఉన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ఉమర్ అహ్మద్